సాక్షి తిరుపతి

సోమవారం । 19 । మే । 2025



కనిపెట్టి.. కా'పాడి'

తిరుపతి రూరల్ మండలంలోని పాడి చెరువులో మట్టి తవ్వకాలపై చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మండిపడ్డారు. - 8లో



ఆహారాన్వేషణలో 'విదేశీ అతిథులు'

నేలపట్టు పక్షుల కేంద్రం వద్ద విదేశీ విహంగాలు నందడి చేస్తున్నాయి. ఆహారాన్వేషణలో నిమగ్నమై ఉన్నాయి. - 8లో



పోలీసుల పేరుతో సైబర్ మోసం

ఐపీఎస్ అధికారి పేరుతో ఫోన్ చేసి ఓ సైబర్ నేరగాడు తిరుపతికి చెందిన ఓ మహిళను మోసం చేశాడు. - 8లో

న్యూస్‌రీల్

గజవాహనంపై సిరులతల్లి



గజవాహనంపై పద్మావతీ దేవి

చంద్రగిరి : తిరుచానూరులోని పద్మావతీదేవి ఆదివారం సాయంత్రం గజవాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. అమ్మవారి జన్మనక్షత్రమైన ఉత్తరాషాడ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా సుప్రభాత సేవతో సిరులతల్లిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. ఆలయ ఆవరణలోని శ్రీకృష్ణ ముఖమండపంలో కనులపండువగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం అమ్మవారికి విద్యుత్ కాంతుల నడుమ ఊంజల్ సేవ చేశారు. అనంతరం సర్వాలంకార భూషితులైన పద్మావతీదేవిని గజవాహనంపై కొలువుదీర్చారు. వర్షం కారణంగా ఆస్థాన మండపంలోనే సేవను పరిపూర్ణం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏఈఓ సతీష్ కుమార్, ఏఈఓ దేవరాజులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూలైన్ కృష్ణతేజ అతిథి గృహం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 87,347 మంది స్వామివారిని దర్శించుకోగా 39,490 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.13 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

రేపటి లోపు హాస్టల్ ఖాళీ చేయాలని ఆదేశం

తిరుపతి సిటీ : ఎస్వీయూలోని ఎఫ్, ఐ బ్లాక్ హాస్టల్‌లోని రీసెర్చ్ స్కాలర్స్ ఈనెల 20వ తేదీలోపు తమ లగేజీతో సహా ఖాళీ చేయాలని వార్డెన్ ఆదేశించారు. ఈ మేరకు విద్యార్థులకు ఆదివారం సమాచారం అందించారు. మెస్ బిల్లులు చెల్లించకుండా ఉంటున్న విద్యార్థులకు వసతి కల్పించే అవకాశం లేదని తెలిపారు. జూన్ మొదటి వారంలో హాస్టల్ పునఃప్రారంభిస్తామని, మెస్ బకాయిలు చెల్లించిన పరిశోధక విద్యార్థులకు మాత్రమే వసతి ఉంటుందని వెల్లడించారు. అనధికారికంగా బయట వ్యక్తులకు వసతి గృహాలలోకి అనుమతించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీటీడీకి రూ.20 లక్షల విరాళం



అదనపు ఈఓకు డీడీ అందిస్తున్న దాతలు

తిరుమల: టీటీడీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి ఆదివారం హిందూస్తాన్ అసోసియేట్స్‌కు చెందిన మస్తాన్‌రావు రూ.20 లక్షల విరాళం అందించారు. తిరుమలలో అదనపు ఈఓకు డీడీ అందజేశారు.



మహిళలతో కలిసి మద్యం దుకాణం వద్ద నిరసన తెలుపుతున్న భూమన అభినయ్, నేతలు



తెరిచి ఉన్న మద్యం దుకాణం

ఆధ్యాత్మిక క్షేత్రం.. ఎనీ టైమ్ మద్యం!

పవిత్ర తిరునగరంలో లిక్కర్ మాఫియా రాజ్యమేలుతోంది. ఆధ్యాత్మిక క్షేత్రంలో ఎనీ టైమ్ మద్యం విక్రయాలు సాగిస్తోంది. గోవిందనామస్మరణతో పులకించే పుణ్యభూమిని మందుబాబులకు అడ్డాగా మార్చేసింది. ప్రభుత్వ అండతో నిబంధనలను తుంగలో తొక్కేస్తోంది. స్థానికులతోపాటు శ్రీవారి భక్తులను లక్ష్యంగా చేసుకుని జేబులు నింపుకుంటోంది. రాత్రింబవళ్లు ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలు చేపడుతోంది. గుడి గంటలు మోగకముందే వైన్ షాపులను తెరిచేస్తోంది. దైవ దర్శనం కంటే ముందే అనధికార పర్మిట్ రూమ్‌లలో మద్యం తాగేందుకు సహకారం అందిస్తోంది. మొక్కులు చెల్లించుకోకముందే భక్తులను మత్తులో ముంచేసి రూ.కోట్లు పోగేసుకుంటోంది. అక్రమార్జన కోసం ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుపతి విశిష్టతను దెబ్బతీసేందుకు తెగబడుతోంది.

మత్తులో జోగుతున్న తిరునగరం

- వేకువజామునే వైన్‌షాపుల్లో మొదలవుతున్న విక్రయాలు
- గుడి గంటలు మోగకముందే గ్లాసుల గలగలలు
- మందుబాబుల కేకలతో నిద్రలేస్తున్న తిరుపతి వాసులు
- లిక్కర్ మాఫియాను బయటపెట్టిన భూమన అభినయ్



మద్యం దుకాణం పక్కనే అనధికార పర్మిట్ రూమ్

సాక్షి ప్రతినిధి తిరుపతి : ఆధ్యాత్మిక రాజధాని తిరుపతి నగరంలో ఎక్కడ పడితే అక్కడ మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. వాటికి అనుబంధంగా ఎలాంటి అనుమతులు లేకుండా పర్మిట్‌రూమ్‌లను సైతం అందుబాటులోకి తీసుకువచ్చి మందుబాబులను పెంచి పోషిస్తున్నారు. వేలాది మందితో రద్దీగా ఉండే రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, వసతి సముదాయాలు, ఆలయ పరిసర ప్రాంతాలను మద్యం మాఫియా టార్గెట్ చేసుకుంది. నగరంలోని 14 దుకాణాలు అయితే ఉదయం 5గంటలకే తెరుచుకుంటున్నాయి. మరో 11 మద్యం షాపుల తలుపుతడితే 24గంటలు వెనుకవైపు నుంచి బాటిళ్లను అందిస్తున్నారు. దీంతో పాటు కొన్ని బార్ల వద్ద సెక్యూరిటీ సిబ్బందిని కలిస్తే నిమిషాలలో కావాల్సిన మద్యం దొరుకుతోంది. అలాగే కొందరు వైన్ షాపు యజమానులు ఫోన్ చేస్తే కస్టమర్లకు మద్యం డోర్ డెలివరీ కూడా చేయిస్తున్నారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా సాగుతున్న మద్యం విక్రయాలతో తిరుపతి నగరం మత్తులో తూలుతోంది.

గుట్టు రట్టు చేసిన అభినయ్

తిరుపతి నగరంలో ఇష్టారాజ్యంగా సాగిస్తున్న మద్యం అమ్మకాల గుట్టును వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి బహిర్గతం చేశారు. ఎనీ టైమ్ మద్యం దొరుకుతున్న పరిస్థితులను ఆదివారం వేకువజామున 5గంటలకు పార్టీ నేతలతో కలసి ఆయన వెలుగులోకి తెచ్చారు. ఆ సమయంలో రైల్వే స్టేషన్ సమీపంలోని నైన్‌స్టార్ వైన్‌షాపు తెరుచుకుని ఉండడం చూసి అభినయ్, ఇతర నేతలు ఆశ్చర్యపోయారు. అనధికార పర్మిట్‌రూమ్‌లో మందుబాబులు పెద్దసంఖ్యలో మద్యం తాగుతున్న విషయాన్ని మీడియా ముందుకు తీసుకువచ్చారు. అధికారులతో కుమ్మక్కైన వైన్‌షాపు యజమానులు సాగిస్తున్న మద్యం దందాతో తిరుపతి పవిత్రత మంటగలిసిందని భూమన అభినయ్ ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో నేరాలు, అసాంఘిక ఘటనలు పెరిగిపోవడానికి ఎనీ టైమ్ మద్యం కారణమని ఆరోపించారు. సంపద సృష్టి ఇదేనా చంద్రబాబూ...అంటూ అభినయ్ మండిపడ్డారు. సనాతన ధర్మ పరిరక్షకుడినని ప్రకటించుకున్న పవన్ కల్యాణ్‌కు ఈ అపవిత్ర ఘటనలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.



మద్యం విక్రయిస్తున్న దుకాణదారుడిని ప్రశ్నిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి పరిధిలో వైన్‌షాపుల వివరాలు

నగర జనాభా	సుమారు 4లక్షలు
మద్యం దుకాణాలు	45
బార్‌లు	13
అనధికారిక పర్మిట్ రూమ్‌లు	55
ఉదయం 5గంటలకే తెరుచుకుంటున్న షాపులు	14
24గంటలపాటు విక్రయాలు సాగిస్తున్నవి	11

నగర వాసుల ఆగ్రహం

తిరుపతిని మద్యం అడ్డాగా మార్చేశారని నగర వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బడి, గుడి, నివాసాలు అనే తేడా లేకుండా వైన్‌షాపులు ఏర్పాటు చేశారని మండిపడుతున్నారు. ఇష్టారాజ్యంగా రాత్రింబవళ్లు మద్యం అమ్ముతుండడంతో మందుబాబుల ఆగడాలు భరించలేకపోతున్నామని వాపోతున్నారు. నిత్యం వారి అరుపులు, కేకలు, అసభ్య దూషణలతోనే నిద్రలేవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నగరంలో ప్రశాంత వాతావరణం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు సైతం లిక్కర్ మాఫియాకు అమ్ముడుపోయారని విమర్శిస్తున్నారు. చివరకు శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల భద్రతను కూడా ప్రశ్నార్థకంగా మార్చేశారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికార యంత్రాంగం

మద్యం పాలసీ అమలు చేయడంలో ఎక్సైజ్ శాఖ పూర్తిగా విఫలమైంది. నిబంధనల ప్రకారం వైన్ షాపులను ఉదయం 10 నుంచి రాత్రి 10గంటల వరకు, బార్లను ఉదయం 10 నుంచి 11గంటల వరకు మాత్రమే తెరవాల్సి ఉంటుంది. అయితే తిరుపతి నగరలలో ఎప్పుడు కావాలంటే అప్పుడు మద్యం దొరుకుతున్నా నిలువరించలేని దుస్థితిలో అధికార యంత్రాంగం ఉంది. చట్ట విరుద్ధంగా వైన్‌షాపులు నడుపుతున్నా చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. గతంలో సమయానికి మించి 5నిమిషాలు ముందు తెరవడం కానీ, 5నిమిషాల తర్వాత మూసివేయాలన్నా భయపడే పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం కూటమి నేతల అండదండలతో మద్యం మాఫియా రెచ్చిపోతోంది. సమయ పాలన లేకుండా లిక్కర్ విక్రయాలు సాగిస్తోంది.



వెనుక తలుపు నుంచి విక్రయం




01:11AM

డీబీఆర్ హాస్పిటల్ రోడ్డులో..



05:31AM

కొత్తపల్లిమిట్ట రోడ్డులో..



05:49AM

శివజ్యోతి నగర్‌లో..



06:09AM

శ్రీకృష్ణనగర్‌లో..



06:13AM

సత్యనారాయణపురం రోడ్డులో..



08:07AM

దేవేంద్ర థియేటర్ రోడ్డులో..

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు.అధికారులు ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలని కలెక్టర్ ఆదేశించారు.

కనిపించని వసతులు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు కలెక్టరేట్‌కు ప్రతి సోమవారం 1000 మందికి పైగా ప్రజలు వస్తుంటారు. అలాగే వివిధ పనుల నిమిత్తం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వారికి సరైన వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుర్చోవడానికి కుర్చీలు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేదు. కలెక్టరేట్‌లో ఒక్కచోట మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. గ్రీవెన్స్‌కు 1000 మందికి పైగా వచ్చిపోతుంటారు. ఈ క్రమంలో ముందు రోజు ఆ మరుగుదొడ్లను శుభ్రం చేయాల్సి ఉంది. లేదంటే కంపు భరించలేని దుస్థితి చోటుచేసుకుంటుంది. అర్జీదారులపై టోకెన్లు ఇచ్చే కొందరు దురుసుగా ప్రవరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కలెక్టరేట్‌లో అధికారుల వద్దకు ఎలా వెళ్లాలి అన్న విషయం తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అర్జీలను రాసేందుకు రెవెన్యూ సిబ్బందిని నియమించడం లేదు. టోకెన్ నంబర్, ఇతర సమాచారం అందించేందుకు సిబ్బంది ఏర్పాటు చేయాలని పలువురు అర్జీదారులు అభిప్రాయపడుతున్నారు.



కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీదారులు (ఫైల్)

రొయ్యా..రివర్స్!

- ఎగుమతి చేసిన రొయ్యలను వెనక్కిపంపుతున్న పలు దేశాలు
- రసాయనిక అవశేషాలున్నాయని వెల్లడి
- చేసేదిలేక తక్కువ ధరకే స్థానికంగా అమ్ముకుంటున్న వ్యాపారులు
- ఇకపై నూతన లేబులింగ్‌తో ఎక్స్‌పోర్టుకు శ్రీకారం



ఎగుమతి చేసే కంటైనర్‌లు

వాకాడు : ఆక్వా రంగంపై మరో పిడుగు పడింది. రసాయనిక అవశేషాలున్నాయని ఎగుమతి చేసిన ఉత్పత్తులను పలు దేశాలు తీసుకునేందుకు నిరాకరించడంతో రైతులు, వ్యాపారులకు దిక్కుతోచని దుస్థితి దాపురించింది. రొయ్యల కంటైనర్లను వెనక్కు పంపుతుండడంతో ఆక్వా పరిశ్రమ కుదేలైంది. తాజాగా ఇటీవల జపాన్, అమెరికా దేశాలకు చెన్నై నుంచి పంపిన 10 కంటైనర్ల రొయ్యలు తిరిగి వచ్చేశాయి. ఒక్కో కంటైనర్‌లో దాదాపు 60 టన్నుల నుంచి 100 టన్నుల వరకు ప్రాసెస్ చేసిన రొయ్యలు ఉంటాయి. అంటే దాదాపు 600 టన్నుల రొయ్యలను తిరస్కరించారు. వాటిని ఆయా దేశాల నిపుణులు పరీక్షించి యాంటీబయాటిక్స్ అవశేషాలు ఉన్నట్లు గుర్తించారు. ఆ రొయ్యలను తింటే చర్మ వ్యాధులతోపాటు, వివిధ రకాల వైరస్ సోకుతుందని వెల్లడించారు. సుమారు రూ.264 కోట్లు విలువైన రొయ్యలను రాష్ట్రవ్యాప్తంగా ఆక్వా వ్యాపారులు నష్టపోయినట్లు తెలిసింది. దీంతో చేసేది లేక వివిధ రాష్ట్రాల్లోని రెస్టారెంట్లు, హోటళ్లతోపాటు స్థానిక మార్కెట్‌లలో తక్కువ ధరకే విక్రయించుకోవాల్సి వచ్చింది. ఈ ప్రభావంతో రైతుల నుంచి కొనుగోళ్లను వ్యాపారులు నిలిపేశారు. ఈ క్రమంలో రైతులు సైతం వచ్చిన ధరకే స్థానికంగా లూజు విక్రయాలు చేయాల్సి వచ్చింది.



రొయ్యలను గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

రవాణాలో కొత్త విధానం

విదేశాలకు ఎగుమతి చేస్తున్న రొయ్యలకు లేబులింగ్ అనే నూతన విధానం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఏ ప్రాంతంలో రొయ్యలు సాగు చేశారు. ఎలాంటి యాంటీ బయాటిక్స్ వాడారు. ఏ యూనిట్‌లో ప్రాసెస్ పూర్తి చేశారనే వివరాలను ఆ లేబుల్‌పై పొందుపరచనున్నారు. ఈ క్రమంలో అధికంగా యాంటీబయాటిక్స్ వాడుతున్న రైతులను గుర్తించే వెసులుబాటు ఉంటుందని అధికారులు వెల్లడిస్తున్నారు. అలాగే ప్రతి కంటైనర్‌లో 50 శాతం శాంపిళ్లను తప్పనిసరిగా పరీక్షించాలని రాష్ట్ర మత్స్యశాఖ నిర్ణయించింది.

58,580 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 6 వేల మంది ఆక్వా రైతులు ఉన్నారు. అధికారికంగా 35వేల ఎకరాలు, అనధికారికంగా మరో 15 వేల ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తున్నారు. అలాగే హేచరీలు 97 వరకు ఉన్నాయి. తద్వారా ఏటా 58,580 మెట్రిక్ టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతున్నాయి. మొదటి సీజన్‌లో 30 వేల టన్నులు, రెండో సీజన్‌లో 28 వేల టన్నులు మాత్రమే ఉత్పత్తి ఉంటుంది. అయితే కొందరు రైతులు రెండో క్రాపులో కూడా ఎక్కువ దిగుబడి సాధించేందుకు విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వాడుతున్నారు. అసలు విషయం గుర్తించకుండా ఎన్ని టన్నుల ఉత్పత్తి పొందామనే లెక్కలు వేసుకుంటున్నారు. ఆ మేరకు ప్రాసెసింగ్ యూనిట్లకు తరలిస్తున్నారు. అక్కడ నుంచి విశాఖపట్నం, కాకినాడ, చెన్నై నగరాల నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. యూరోపియన్ యూనియన్‌కు సంబంధించిన పది దేశాలు మన దేశం నుంచి రొయ్యలు దిగుమతి చేసుకుంటున్నాయి. ప్రధానంగా జపాన్, అమెరికాకు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి.

ఆశనిపాతం

- పీఎస్ఎల్వీ రాకెట్‌లో సాంకేతికలోపం
- విఫలమైన ప్రయోగం
- నైరాశ్యంలో షార్ శాస్త్రవేత్తలు



సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)ను పీఎస్ఎల్వీ రాకెట్ విజయపథంలో నడిపించింది. షార్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసింది. 99శాతం సక్సెస్ రేటుతో జయకేతనం ఎగురవేసింది. ఇప్పటి వరకు 60 ప్రయోగాలు విజయవంతం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తల ప్రతిష్ట ఖండాంతరాలను అధిగమించింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 5.59 గంటలకు నింగికెగసిన పీఎస్ఎల్వీ సీ61 రాకెట్ విఫలం కావడం యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. ఎందుకంటే పీఎస్ఎల్వీ రాకెట్ అంటే ఇస్రోకు తిరుగులేని సక్సెస్ అందించేది. అలాంటిది పీఎస్ఎల్వీ సీ61 ప్రయోగం మూడో దశలోని ఘన ఇంధన్ మోటార్లలో సాంతికేక లోపం ఏర్పడి వైఫల్యం చెందడాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. భారత్–పాక్ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో చేసిన ప్రయోగం కావడంతో ఈ అపజయాన్ని తట్టుకోలేకపోతున్నారు.

3 పర్యాయాలు నిరాశ

షార్ నుంచి ఇప్పటి వరకు 63 పీఎస్ఎల్వీ రాకెట్‌లను ప్రయోగించగా ఆదివారం నాటి సీ61తో కలుపుకుంటే మొత్తం మూడు ప్రయోగాలు పరాజయం చవిచూశాయి. 44 మీటర్లు పొడవు 320 టన్నుల బరువుతో 1,400 కిలోల బరువు కలిగిన ఐఆర్ఎస్–1ఈ అనే ఉపగ్రహాన్ని 1993 సెప్టెంబర్ 20న మొట్టమొదటిగా పీఎస్ఎల్వీ–డీ1 పేరుతో ప్రయోగించగా, నాలుగోదశలోని ద్రవ ఇంధన దశలో సాంకేతిక లోపం ఏర్పడడంతో విఫలమైంది. తర్వాత 2017 ఆగస్టు 31న ప్రయోగించిన పీఎస్ఎల్వీ సీ37 ప్రయోగం కూడా విజయవంతం కాలేదు. అయితే ఆ ప్రయోగంలో రాకెట్‌కు శిఖరభాగంలో ఉపగ్రహాన్ని అమర్చిన హీట్‌షీల్డ్ విడిపోకపోవడంతో వైఫల్యం చెందింది. అప్పట్లో హీట్‌షీల్డ్‌కి లెదర్ బోల్టు వేయాల్సింది, ఐరన్ బోల్టు వేశారని అందుకే హీట్‌షీల్డ్ విడిపోలేదని ప్రచారం కూడా జరిగింది. ఇప్పటి దాకా చేసిన 63 ప్రయోగాల్లో 60 ప్రయోగాలు సక్సెస్ అయి 99 శాతం సక్సెస్ రేటులో ముందంజలో వున్నప్పటికీ కీలక సమయాల్లో అపజయం పాలు కావడం ఇస్రో శాస్త్రవేత్తలను బాధిస్తోంది. మొదటి రాకెట్ విఫలం తర్వాత వరుసగా 38 ప్రయోగాలను ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది. 2017 ఆగస్టు 31న ప్రయోగం విఫలమైన తర్వాత 22 ప్రయోగాలు చేసి వరుస విజయాలు సాధించింది. ఈ నాలుగు దశాబ్దాల్లో 60 పీఎస్ఎల్వీ రాకెట్ల ద్వారా 518 ఉపగ్రహాలను ప్రయోగించారు. ఇందులో 38 దేశాలకు చెందిన 433 విదేశీ ఉపగ్రహాలను, 72 స్వదేశీ ఉపగ్రహాలు, దేశీయంగా పలు యూనివర్సిటీలకు చెందిన 15 ఉపగ్రహాలను ప్రయోగించారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన పీఎస్ఎల్వీ రాకెట్ పరాజయం సాంకేతికలోపమా..? మానవ తప్పిదమా..? అనే విషయం తెలియాల్సి ఉంది. ఈ క్రమంలో రాకెట్ ప్రయోగం విఫలం కావడంపై ఇస్రో నిజ నిర్ధారణ కమిటీ వేసింది.

క్లుప్తంగా

ముక్కంటి భక్తుడికి గాయాలు



చికిత్స పొందుతున్న వెంకటయ్య

శ్రీకాళహస్తి : ముక్కంటి దర్శనానికి విచ్చేసిన వెంకటయ్య అనే భక్తుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. తెలంగాణ రాష్ట్రం నల్గొండకు చెందిన వెంకటయ్య కుటుంబసమేతంగా ఆదివారం శ్రీకాళహస్తికి చేరుకున్నారు. ఆటోలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఆటో అదుపుతప్పి బజ్జీల బండిని ఢీకొంది. దీంతో వెంకటయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాలు విరగడంతో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తరలించారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపిన ఆటోడ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

ఐరాల: చంద్రగిరి సమీపంలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి చేసిన దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, కిడ్నాప్, హత్యాయత్నం కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని జిల్లా బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు సురేంద్రబాబు డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం ఐరాలలో మీడియాతో మాట్లాడుతూ దళిత విద్యార్థిపై అగ్రకులానికి చెందిన కొంత మంది విచక్షణా రహితంగా దాడి చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. జేమ్స్‌కు న్యాయం చేయకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం ..చికిత్స పొందుతూ మృతి

తిరుపతి క్రైమ్: ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ మరణించింది. తలుపిరి పోలీసుల కథనం.. శెట్టిపల్లెలో నివాసం ఉంటున్న కొరివి ఆదిలక్ష్మి(40) భర్త కొంతకాలం క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి ఆర్థిక పరిస్థితులు సరిగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15వ తేదీన వాస్మాయిల్ తాగడంతో ఆమెను రుయా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆమె ఆదివారం ఉదయం మృతి చెందింది. ఆమె కుమార్తె మానస ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాల తరలించారు.

కనిపెట్టి..కాపాడి



పాడి చెరువులో తవ్వేసిన గోతులను పరిశీలిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

"టీడీపీ కార్యకర్తల ధన దాహం తీర్చేందుకు..ఉపాధి కూలీల కడుపు కొడతారా..? చెరువులను చెరబట్టి.. విచ్చలవిడిగా మట్టిని తవ్వేస్తారా..? ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి దిగుతారా..? కూలి పనులు చేసుకుని పొట్టపోసుకునే నిరుపేదల నోటి కాడ కూడు లాగేస్తారా..? ప్రజలు మీకు అధికారం ఇచ్చింది ఇందుకేనా..? ప్రకృతి వనరులను ఇష్టారాజ్యంగా దోచేసుకుంటారా..? అవినీతికి పాల్పడితే సహించం. చెరువులను కొల్లగొడితే ఒప్పుకోం. ప్రజల పక్షాన నిలబడుతాం. ఇసుక.. మట్టి అక్రమ రవాణాను అడ్డుకుంటాం. ఇందుకోసం ఎందాకైనా పోరాడుతాం. ఆందోళనలను ఉధృతం చేస్తాం'' అంటూ వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఈ మేరకు టీడీపీ నేతలు యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తున్న పాడి చెరువును పరిశీలించారు. ఆయకట్టు రైతుల ఆవేదనను ఆలకించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

- చెరువులను చెరబడితే సహించం
- మట్టిని కొల్లగొడితే ఒప్పుకోం
- చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : మండలంలోని పాడిపేట, ముండ్లపూడి గ్రామాల మధ్యలో ఉన్న పాడి చెరువును వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. సుమారు నెల రోజులుగా టీడీపీ నేతలు ఆ చెరువులో మట్టిని తవ్వేస్తూ ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారు. దీంతో ఆయకట్టు రైతులు, ఉపాధి కూలీలు ఆందోళన చెందారు. చెరువును కాపాడాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. చివరకు ఈ విషయాన్ని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించారు. ఉపాధి కూలీలు, రైతులతో కలిసి చెరువును పరిశీలించారు. మట్టి మాఫియా దురాగతాలపై మండిపడ్డారు. పాడి చెరువులో ఎక్కడపడితే అక్కడ గోతులు తవ్వేసిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కమీషన్లకు కక్కుర్తిపడి ప్రకృతి వనరులను నాశనం చేయిస్తున్న ఎమ్మెల్యే నానికి వంతపాడితే అధికారులను దేవుడు క్షమించడని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. మాటలు నమ్మి నిజమైన పేదలకు అన్యాయం చేసే అధికారులను దేవుడు క్షమించరన్నారు. యథేచ్ఛగా మట్టిని కొల్లగొడుతున్న వారిపై ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. ఈ క్రమంలో చెరువు పరిశీలనకు మోహిత్‌రెడ్డి వస్తున్నారని తెలుసుకున్న అక్రమార్కులు గుట్టచప్పుడు కాకుండా అక్కడ నుంచి ఉడాయించడం గమనార్హం.



చెరువును కాపాడాలని మోహిత్ రెడ్డిని కోరుతున్న మహిళలు

బాధితుల గోడు

పాడి చెరువులో పూడిక తీత, కట్ట పనులను వంద రోజులపాటు చేసుకుంటూ జీవనం సాగించే తమకు టీడీపీ నేతలు అన్యాయం చేస్తున్నారని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద యంత్రాలతో చెరువును తవ్వేస్తూ తమకు పనిలేకుండా చేస్తున్నారని ఆరోపించారు. దీంతో వలస పోవాల్సిన దుస్థితి దాపురించిందని వాపోయారు. పాడి చెరువుపై ఆధారపడి దాదాపు 500 మంది కూలీలు ఉన్నామని వెల్లడించారు. మట్టి తవ్వకాలను అరికట్టేందుకు కృషి చేయాలని మోహిత్‌రెడ్డికి విన్నవించారు. దీనిపై మోహిత్ స్పందిస్తూ గ్రామస్తులతో కలిసి ఆందోళనకు దిగుతామని, అక్రమార్కుల ఆటకట్టిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముండ్లపూడి సర్పంచ్ సూరి, పాడిపేట సర్పంచ్ ధనమునిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యోగానందరెడ్డి, తిరుమలయ్య, హేమాద్రిరెడ్డి, ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మునీశ్వరరెడ్డి, చిన్నియాదవ్, లోకేష్, అవినాష్, మల్లారపు వాసు, శివశంకర్‌రాజు, శశిధర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, రఫీ, సాయి రాయల్, భానుప్రకాష్ రెడ్డి, మల్లెమొగ్గల ఉమాపతి, హరి పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహం పేరుతో మోసానికి యత్నం

– ఇద్దరి అరెస్ట్

తిరుపతి క్రైమ్ : పంచలోహ విగ్రహం పేరుతో ఇత్తడి కరుమారి అమ్మ ప్రతిమను విక్రయించేందుకు యత్నించిన ఇద్దరు వ్యక్తులను ఈస్ట్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాలు.. పలమనేరుకు చెందిన కల్లాటి గురుస్వామి, తన పొలంలో దొరికిన ఇత్తడి కరుమారి అమ్మ విగ్రహం గురించి తిరుపతికి చెందిన తన బంధువు దేవినేని చంద్రశేఖర్‌కు తెలిపాడు. పురాతనమైన పంచలోహాలు విగ్రహాలని చెప్పి ఎవరికైనా అమ్మి రూ.లక్షలు సంపాదించవచ్చని ఇద్దరూ ఆశపడ్డారు. ఈ క్రమంలో తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద విగ్రహం అమ్మేందుకు యత్నిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



చింతా మోహన్(ఫైల్)

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని భవానీశంకరపురంలో ఆదివారం విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. వివరాలు.. స్థానిక దళితవాడకు చెందిన చింతా మోహన్(27) పొలంలో మోటారు వేసేందుకు తండ్రి రంగయ్యతో కలిసి వెళ్లాడు. స్టార్టర్ బాక్స్‌లోని స్విచ్ వేస్తుండగా కరెంట్ షాక్ తగిలింది. వెంటనే రంగయ్య హుటాహుటిన శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మోహన్ మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ చింతా రాజయ్య కోరారు.

నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్

- హాజరుకానున్న 22,415మంది విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు ఏపీ ఈఏపీ సెట్ నిర్వహించనున్నారు. ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్న ఈ పరీక్షకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 22,415మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ మేరకు తిరుపతిలో 5, పుత్తూరులో 2, గూడూరులో 4, మొత్తం 11 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు.

పరీక్ష కేంద్రాలు

తిరుపతిలో..
- చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల, చదలవాడ నగర్, తిరుపతి–రేణిగుంట మార్గం
- అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, వెంకటాపురం, తిరుపతి–కరకంబాడి రోడ్డు
- శ్రీరామా ఇంజినీరింగ్ కళాశాల, శ్రీరామానగర్, తిరుపతి–కరకంబాడి రోడ్డు
- ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, తిరుపతి–కరకంబాడి రోడ్డు
- ఐయాన్ డిజిటల్ జోన్, చెర్లోపల్లె, జూపార్కు రోడ్డు

పుత్తూరులో..
- సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, సిద్ధార్థ నగర్, నారాయణవనం రోడ్డు, పుత్తూరు
- శ్రీవెంకటేశ పెరుమాళ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఆర్‌వీఎస్ నగర్, కార్వేటినగరం రోడ్డు, పుత్తూరు

గూడూరులో..
- ఆదిశంకర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, అరవింద నగర్, ఎన్–5 బైపాస్ రోడ్డు, గూడూరు
- నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, దూర్జటి నగర్, గూడూరు
- ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల, విద్యానగర్, కోట మండలం
- ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, విద్యానగర్, కోట మండలం.

ఆహారాన్వేషణలో విదేశీ అతిథులు



నేలపట్టు పక్షుల కేంద్రంలోని చెరువు నీటిలో సేద తీరుతున్న గూడబాతులు



డీవీ సత్రం మండల ప్రాంతంలో ఏడారిని తలపిస్తున్న పులికాట్ సరస్సు

దొరవారిసత్రం: శీతాకాలపు విదేశీ వలస విహంగాలు ఆహార కొరతను ఎదుర్కొంటున్నాయి. ఇప్పటివరకూ వీటి ఆహారానికి ఆధారంగా ఉన్న పులికాట్ సరస్సు ఎడారిగా మారడంతో పాటు గ్రామీణ ప్రాంతాల చెరువుల్లో నీళ్ల అడుగంటిపోయాయి. దీంతో నేలపట్టు, వెదురుపట్టు ప్రాంతాల్లో విడిది చేస్తున్న వివిధ రకాల వందలాది వలస విహంగాలు ఆహారాన్వేషణలో పడ్డాయి. మైలాంగం, నెల్లూరుపల్లె, మీజూరు, కారికాడు, ఏకొల్లు, పాళెంపాడు, వేణుంబాకం ప్రాంతాల్లో అడుగంటిన చిన్న చిన్న గుంటల్లో ఎర్రకాళ్ల, గూడబాతులు, తెల్లస్వాతి కొంగలు, నీటికాకులు మొదలైన పక్షిజాతులు చేపలను వేటాడుతూ కనిపించాయి.

వయస్సు మీరి..ఎగురలేక..

ఈ పక్షుల సీజన్‌లో నేలపట్టు, పులికాట్ పక్షుల కేంద్రాలకు వేల సంఖ్యలో వివిధ రకాల పక్షులు ఇక్కడ పక్షి ప్రేమికులను, పర్యాటకులను ఆకర్షిస్తుంటాయి. సీజన్ పూర్తయితే వెనుతిరిగి పక్షులు వెళ్లిపోయినప్పటికి వయస్సు మీరి ఎగురలేని గూడబాతులు, నత్తగుల్లకొంగలు మొదలైన పక్షులు కేంద్రాల్లో, పలు చెరువు ప్రాంతాల్లో ఉంటూ వేటాడలేక చివరకు చనిపోతుంటాయి. గత ఏడాది కూడా పదుల సంఖ్యలో గూడబాతులు పక్షుల కేంద్రంలో తీవ్ర ఆహారం కొరతతో మృతి చెందడం విదితమే.



దళిత విద్యార్థిపై దాడి అమానుషం



మాట్లాడుతున్న ఓబుల్‌రెడ్డి

తిరుపతి సిటీ : తిరుపతి సమీపంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి చేయడం అమానుషమని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.ఓబుల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. గ్రామం నుంచి రాష్ట్రస్థాయి వరకు కక్ష సాధింపు చర్యలు, దాడులు, బెదిరింపులు నిత్యకృత్యంగా మారాయని మండిపడ్డారు. దళిత విద్యార్థిపై దాడికి పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భయం గుప్పిట్లో బల్లవోలు

- హల్‌చల్ చేస్తున్న రౌడీషీటర్లు
- ఆందోళనలో గ్రామస్తులు



ఓవ్యక్తిపై దాడికి పాల్పడుతున్న రౌడీషీటర్లు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : చిల్లకూరు మండలం బల్లవోలు భయం గుప్పిట్లో ఉంది. శనివారం రాత్రి రౌడీషీటర్లు హల్‌చల్ చేయడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గూడూరుకు చెందిన ఓ ప్రజాప్రతినిధి అండతో రౌడీషీటర్లు రెచ్చిపోవడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. వివాలు.. బల్లవోలు గ్రామానికి చెందిన ఓ రౌడీషీటర్ తన కుటుంబంలో శనివారం నిర్వహించే ఓ కార్యక్రమానికి తన స్నేహితులను పిలిచాడు. అందరూ పూటుగా మద్యం తాగారు. సమీపంలోని కాలువలో కొందరు గిరిజనులు చేపలుపట్టుకుంటూ ఉండగా వారితో మాటలు కలిపారు. తాను తెలుసా అని వారిని ప్రశ్నించారు. తమకు తెలియదని, సమీపంలోన అల్లీపురానికి చెందిన మనేష్ తెలుసని చెప్పడంతో సదరు రౌడీ షీటర్ రెచ్చిపోయాడు. తన ప్రత్యర్థి తెలుసని చెప్పడంతో విచక్షణారహితంగా గిరిజనులపై దాడి చేశాడు అడ్డుకోబోయిన శ్రీను అనే స్థానికుడిని సైతం స్నేహితులతో కలిసి కొట్టాడు. దీనిపై ప్రశ్నించిన శ్రీను బంధువులపై సైతం దాడికి పాల్పడ్డాడు. ఈలోపు గిరిజనులు అల్లీపురం వెళ్లి మనేష్‌ను తీసుకురావడంతో అతడిపై కూడా మూకుమ్మడిగా పడి తరిమి తరిమి కొట్టారు. దీంతో బల్లవోలులో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. గ్రామస్తుల నోరు మెదిపేందుకు కూడా భయపడే దుస్థితి దాపురించింది.

భార్యను హత్య చేసిన భర్త

నాయుడుపేటటౌన్ : మండలంలోని మడపలం సమీపంలో కట్టుకున్న భార్యను ఓ వ్యక్తి హత్య చేశాడు. వివరాలు.. వేముగుంటపాళెం పంచాయతీ కాలువగట్టు వద్ద కృష్ణవేణి అలియాస్ వీణమ్మ(28), రాపూరు శ్రీనివాసులు దంపతులు నివసిస్తున్నారు. వారికి ముగ్గురు పిల్లలు. భార్యాభర్తలు కూలి పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి వీణమ్మ, శ్రీనివాసులు మద్యం సేవిస్తుండగా వాగ్వాదం జరిగింది. ఉదయం కాలువగట్టుపై వీణమ్మ మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మద్యం మత్తులో శ్రీనివాసులే తన భార్యను రాయితో కొట్టి హత్య చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ క్రమంలోనే చిట్టమూరులో నివసించే మృతురాలి తల్లి తుపాకుల పెంచలమ్మ కూడా తన కుమార్తెను అల్లుడే చంపినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాబీ తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, గాలిస్తున్నామని వెల్లడించారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలి మృతి

తిరుపతి క్రైమ్ : తిరుపతి కొర్లగుంట మారుతీనగర్‌లో ఓ వృద్ధురాలు అనుమానాస్పదస్థితిలో ఆదివారం మృతి చెందింది. వివరాలు.. శంకరమ్మ (63) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇటీవలే ఇంటికి వచ్చింది. ఇంతలో ఏమైందో ఆమె అకస్మాత్తుగా మరణించింది. శంకరమ్మ మృతిపై కోడలు కవిత అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల పేరుతో సైబర్ మోసం

తిరుపతి క్రైమ్ : ఐపీఎస్ అధికారిని మాట్లాడుతున్నాను మీరు అరెస్టు కాకుండా ఉండేందుకు నగదు ఇవ్వాలంటూ మోసం చేసిన ఘటన ఆదివారం తిరుపతిలో జరిగింది. వివరాలు... నగరంలోని కొర్లగుంటకు చెందిన రాజమ్మకు సైబర్ మోసగాళ్లు డిజిటల్ అరెస్ట్ బెదిరింపు కాల్ చేశారు. తమకు నగదు చెల్లించకుంటే అరెస్ట్ చేస్తామని బెదిరించారు. దీంతో భయభ్రాంతులకు గురైన మహిళ రూ.70 వేలను వారి అకౌంట్‌కు పంపింది. నగదు బదిలీ అయిన తర్వాత మోసపోయానని గుర్తించి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ మృతుడు ఎవరో..?

- గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తిరుమల : తిరుమలలోని జీఎన్సీ టోల్ గేట్ సమీపంలో ఉన్న పార్కులో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. తిరుమల టూటౌన్ పీఎస్ సీఐ శ్రీరాముడు కథనం.. పార్కులోని బెంచీపై ఓ వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి పరిశీలించారు. మృతుడి పక్కనే కూల్‌డ్రింక్ బాటిల్, పురుగు మందుల డబ్బా పడి ఉండడం గుర్తించారు. మృతుడి వయస్సు దాదాపు 45 ఏళ్లు. ఇతడి గురించి తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి ప్రభుత్వ రుయా ఆసుపత్రికి తరలించారు.



పార్కులో బెంచీపై మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

ఉచితం.. వాయిదాల పర్వం

ఎన్నికల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ఊదరగొట్టిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత దాని వాయిదాల మీద వాయిదాలు వేస్తున్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని అదిగో ఉచిత బస్సు.. ఇదిగో ఉచిత బస్సు ప్రయాణమని చెబుతూ వారి దృష్టిని మళ్లించడానికి హడావుడి చేస్తున్నారు. ఇందులో భాగంగానే రెండు రోజుల్లో జిల్లాలోని ఏ డిపోలో ఎన్ని సర్వీసులు నడుస్తున్నాయి. ఖాళీగా ఎన్ని ఉన్నాయో తెలపాలని అధికారులకు తాజాగా ఉత్తర్వులు పంపించారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు కోసమే కసరత్తు మొదలుపెట్టినట్టు చెబుతున్నారు.

- మూడు నెలలకొకసారి ఆర్టీసీ సర్వీసుల ఆరా
- దృష్టి మళ్లించడానికే హడావుడి అంటున్న ప్రజలు



తిరుపతి సెంట్రల్ బస్టాండ్

తిరుపతి అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 11 ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. 743 బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. ప్రత్యేకంగా తిరుమలతోపాటు రేణిగుంట ఎయిర్‌పోర్ట్, నెల్లూరు, మదనపల్లి, కడపకు 100 విద్యుత్ బస్సులను నడుపుతున్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. తెలంగాణాలో ఉచిత బసుస ప్రయాణ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోంది. అక్కడ అత్యధికంగా మహిళలు ఆలయాలు ఉండే ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు ఆర్టీసీ పెద్దలు చెబుతున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుమల, కాణిపాకం, శ్రీకాళహస్తి, తిరుచానూరు, సూళ్లూరుపేట చెంగాళమ్మ, అప్పలాయగుంట, శ్రీనివాసమంగాపురం తదితర ప్రాంతాల్లో ఉచిత మహిళా బస్సులను అధికంగా ఏర్పాటు చేయాలని ఆర్టీసీ యోచన చేస్తోంది. ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిబంధనలు అందిన వెంటనే కార్యాచరణ మొదలు పెట్టాలని భావిస్తున్నారు. ఇప్పటి నుంచే ఏయే మార్గంలో ఎన్ని సర్వీసులు ఏర్పాటు చేయాలనే అంశాలపై జోరుగా కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఏ డిపోలో ఎన్ని సర్వీసులు ఖాళీగా ఉన్నాయి. ప్రత్యేకించి ఉచిత బస్సులకు వాడుకోవడానికి ఏ డిపో నుంచి ఎన్ని సర్వీసులు తీసుకోవాలి. చిన్న చిన్న మరమ్మతులకు గురై వాడుకలో లేని సర్వీసులు ఎన్ని ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేయడానికి వీలవుతుందా తదితర అంశాలపై జిల్లా ఆర్టీసీ పెద్దలు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో డిపోల వారీగా ఉన్న బస్సులు

తిరుపతి–108
అలిపిరి–60
తిరుమల–109
మంగళం–89
శ్రీకాళహస్తి–88
పుత్తూరు–75
సత్యవేడు–51
గూడూరు–44
సూళ్లూరుపేట–36
వెంకటగిరి–40
వాకాడు–43
మొత్తం–743

జిల్లా ఆర్టీసీ సమాచారం...

- జిల్లాలో 11 ఆర్టీసీ డిపోలు
- 743 ఆర్టీసీ సర్వీసులు
- 100 విద్యుత్ సర్వీసులు
- 4255 మంది ఉద్యోగులు
- రోజు వారి ప్రయాణికులు–5.75లక్షలు
- రోజు వారి ఆదాయం–1.60 కోట్ల నుంచి 1.70 కోట్లు
- ఆర్టీసీ దుకాణాలు–504
- ఏడాదికి దుకాణాల ద్వారా ఆదాయం–52 కోట్లు
- కార్గో ఏడాది ఆదాయం–72 లక్షల నుంచి 80 లక్షలు